సాక్షి
చిత్తూరు
మంగళవారం, 16, ఏప్రిల్, 2024



కూలి పనికి తీసుకెళ్లి..

కూలి పనికి తీసుకెళ్లి టీడీపీ నేతలు పచ్చ కండువాలు కప్పేశారని టీఆర్ కండ్రిగ గ్రామస్తులు మండిపడ్డారు. - 8లో



పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా వసతులు

జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. - 8లో



పాదరక్షలు ధరించనంటూ..

కుప్పం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ దీక్ష చేపట్టాడు. - 8లో

న్యూస్‌రీల్

బ్రిటన్ వర్సిటీతో 'అపోలో' ఒప్పందం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వర్సిటీల ప్రతినిధులు

చిత్తూరు రూరల్: విదేశీ ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకే బ్రిటన్ కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ లీసేస్టర్‌తో అపోలో గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి ఒప్పందం కుదుర్చుకున్నట్లు చిత్తూరు అపోలో వర్సిటీ ఇన్‌చార్జి పి.నరేష్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సోమవారం ఈ మేరకు వర్సిటీ సమావేశ మందిరంలో యూనివర్సిటీ ఆఫ్ లీసేస్టర్ ప్రతినిధులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తమ రెండు యూనివర్సిటీల ఒప్పందం మేరకు రాబోయే విద్యా సంవత్సరంలో బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నామన్నారు. మూడేళ్ల కోర్సులో తొలి రెండేళ్లు చిత్తూరు అపోలో యూనివర్సిటీలో, చివరి ఏడాది లీసేస్టర్ వర్సిటీలో విద్యను అభ్యసించాల్సి ఉంటుందని వివరించారు. అనంతరం కోర్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో యూనివర్సిటీ ఆఫ్ లీసేస్టర్ డిప్యూటీ వీసీ ప్రొఫెసర్ హెన్రీటా ఓ కార్నర్, ప్రతినిధి కెర్రీలా, అపోలో యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వినోద్‌భట్, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోతరాజు, పీఆర్‌ఓలు కమ్రుద్దీన్, ధనంజయులు పాల్గొన్నారు.

మే 3 నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సిబ్బందికి నియోజకవర్గాల వారీగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు అధికారులు పకడ్బందీ కసరత్తు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 12,500 మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. వారందరికీ ఇప్పటికే జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చారు. మొదటి ర్యాండమైజేషన్ తర్వాత ఉద్యోగులను పలు నియోజకవర్గాలకు కేటాయించారు. విధులకు కేటాయించిన ఆయా నియోజకవర్గాల్లో శిక్షణల ఇచ్చేందుకు ఆర్‌ఓలు చర్యలు చేపడుతున్నారు. మే 3వ తేదీన పీఓ, ఏపీఓలకు, మే 4వ తేదీన ఓపీఓలకు, మే 5వ తేదీన పోలీసు, మైక్రో అబ్జర్వర్లకు, మే 6వ తేదీన ఇతర సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

గంగ జాతరకు అనుమతి తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున గంగ జాతర నిర్వహణకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆర్‌ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందస్తు అనుమతి లేకుండా జాతర నిర్వాహకులు చాటింపు వేయకూడదని స్పష్టం చేశారు. మే 10వ తేదీ లోపు, మే15వ తేదీ తర్వాత గంగ జాతర నిర్వహించుకోవచ్చన్నారు. అయితే ముందుగా ఆయా పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని సూచించారు. జాతర సమయంలో రోడ్లను బ్లాక్ చేయడం, ప్రభుత్వ స్థలాల్లో రాజకీయపార్టీల బ్యానర్‌లు పెట్టడం చేయకూడదని స్పష్టం చేశారు.

పుత్తూరు డీవైఈఓగా ప్రభాకర్‌రాజు



పుత్తూరు: పుత్తూరు డీవైఈఓగా హెచ్.ప్రభాకర్‌రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణవనం ఎంఈఓగా పనిచేస్తున్న ఆయనకు డీవైఈఓగా ఎఫ్‌ఏసీ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రాజుకు డివిజన్‌లోని ఎంఈఓలు, హెచ్‌ఎంలు అభినందలు తెలిపారు.

ఉత్తమ విద్యార్థినికి అభినందన



మౌనికను అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని మౌనికను కలెక్టర్ షణ్మోహన్ అభినందించారు. చిత్తూరు కొంగారెడ్డిపల్లెలోని విద్యావికాస్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివిన విద్యార్థిని మౌనిక ఎంపీసీలో 1000కి 991 మార్కులు సాధించింది. విద్యార్థిని తండ్రి ముత్తుకుమార్ కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా, తల్లి ప్రియవేణి ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఉత్తమ మార్కులు సాధించిన మౌనికను సోమవారం కలెక్టరేట్‌కు పిలిపించి కలెక్టర్ శభాష్ అని ప్రశంసించారు. మరింత ఉత్తమంగా చదివి తల్లిదండ్రులకు, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రాళ్లు వేయించుకుంటే..
సింపతీ రాదు బాబూ!

- తిరుపతి ఉప ఎన్నికల్లోనూ రాళ్లు వేసినట్లు డ్రామా ఆడారు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, తిరుపతి: 'సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై సింపతీ ఎక్కడ పెరిగిపోతుందోనని టీడీపీలో ఆందోళన మొదలైంది. అందుకే ఇప్పుడు చంద్రబాబు తనమీద తానే రాళ్లు విసిరించుకుని సింపతీ పొందాలని చూస్తున్నారు' అంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాళ్లు వేయించుకున్నంత మాత్రాన సింపతీ రాదని చంద్రబాబుకు చురకలు అంటించారు. తిరుపతిలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఉద్దేశించి చంద్రబాబు రాళ్లతో కొట్టాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. చంద్రబాబు నాయుడు వద్ద మంచి పేరు కోసం టీడీపీ వారే సీఎం వైఎస్ జగన్‌పై రాళ్లు విసిరారని మండిపడ్డారు. ఒకే రాయి.. సీఎంకు తగిలి, పక్కనే ఉన్న వెల్లంపల్లి శ్రీనివాస్‌కి తగిలిందని గుర్తుచేశారు. ఆయన కూడా కంటికి చికిత్స తీసుకుంటున్నారన్నారు. ఇవేమీ చంద్రబాబు అండ్ కోకు కనిపించవా? అని ప్రశ్నించారు. అయినా కూడా తనపై రాళ్ల దాడి జరిగిందని చంద్రబాబు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు వయసుకు తగినట్లు మాట్లాడడం లేదని మండిపడ్డారు. రాజకీయాల్లో హుందాగా వ్యవహరించాలి కానీ.. చంద్రబాబు హత్యా రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి ఘటనపై చంద్రబాబు, లోకేష్ నీచంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో కూడా రాళ్లు వేసినట్టు చంద్రబాబు డ్రామా ఆడారని గుర్తుచేశారు. అలిపిరి ఘటన తర్వాత సింపతీతో ఎన్నికలు గెలుద్దాం అని ముందస్తుకు వెళ్లి ఓడిపోయారని గుర్తుచేశారు. సింపతీతో ప్రజలు ఓటు వేయరని, చంద్రబాబు ఇకనైనా గ్రహించాలని సూచించారు. సింపతీతో జనాలు ఓట్లేయరనే విషయం చంద్రబాబుకు అనుభవపూర్వకంగా తెలుసునంటూ చురకలంటించారు. తండ్రి నీచంగా మాట్లాడుతుంటే, తనయుడు లోకేష్ మరింత నీచంగా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి నీచ రాజకీయాలు చేయడం దురదృష్టకరమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు సంక్షేమం అందిస్తూ అండగా ఉంటే.. ప్రజలు నేతలపై నమ్మకం ఉంచుతారని తెలిపారు. అందుకే సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన దాడి ఘటనను ఇప్పుడు ప్రజలంతా ఖండిస్తున్నారని తెలిపారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తిపై దాడి జరిగితే కనీసం మర్యాదపూర్వకంగా పరామర్శకు రావాల్సింది పోయి.. నీచ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని మంత్రి పెద్దిరెడ్డి స్పష్టం చేశారు.

భాను.. డాను

గత టీడీపీ ప్రభుత్వంలో అక్రమ వ్యాపారాలకు అండగా నిలిచారు.. ఎర్ర దొంగలకు కాపుకాశారు.. మద్యం సిండికేట్‌లకు వెన్నుదన్నుగా నిలబడ్డారు.. బియ్యం స్మగ్లర్లతో దోస్తీ కట్టారు.. ఇదంతా ఎవరి గురించో నగరి నియోజకవర్గ ప్రజలందరికీ విదితమే. 2019 ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన భానుప్రకాష్‌తో అంటకాగిన వారందరూ తదనంతర కాలంలో వివిధ నేరాలు చేస్తూ పట్టుబడ్డారు. చీకటి సామ్రాజ్యంతో సంబంధాలు పెట్టుకుని యథేచ్ఛగా దందా సాగిస్తున్నందుకే అప్పటి ఎన్నికల్లో ప్రజలు ఓటు తగిన బుద్ధి చెప్పారు. నాటి ఘటనలను నేటికీ నగరి వాసులు మరువలేదు. ఓడించినా పాత పంథాలోనే ఇప్పటికీ సాగుతున్న చీకటి భానుడికి మళ్లీ గుణపాఠం నేర్పేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.





గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ భానుప్రకాష్ అనుచరులు (ఫైల్)

- అక్రమ వ్యాపారులకు అనుగుణంగా అడుగులు
- గుట్టు చప్పుడు కాకుండా అనుచరులతో దందాలు
- ఎన్నికల ప్రచారంలో సైతం వారితోనే నేతలకు ప్రలోభాలు
- భాను గెలుపే లక్ష్యంగా కానులు వెదజల్లుతున్న స్మగ్లర్లు

సాక్షి నెట్‌వర్క్ : నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరాచకాలు సాగించారు. ఇప్పుడు కూడా భాను అండతోనే ఆయన అనుచరులు రెచ్చిపోతున్నారు. అధికారం లేకున్నా గుట్టుచప్పుడు కాకుండా అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తూ వచ్చిన భాను అనుచరులు ఇటీవల పట్టుబడటంతో వారి బండారం బయటపడింది. వారు భానుతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు కూడా వెలుగు చూడడంతో, ఇప్పటి వరకు ఇవన్నీ ఆరోపణలే అనుకుంటున్న వారిని సైతం ఆలోచింపజేస్తున్నాయి.

హత్యాయత్నం కేసులోనూ..

తమిళనాడులోని తిరుత్తణిలో మంత్రి ఆర్‌కే రోజా కార్యాలయ కార్యదర్శి ప్రతీష్‌పై జరిగిన హత్యాయత్నం కేసులోనూ టీడీపీ వారే ప్రధాన నిందితులు. తిరుత్తణి పోలీసులు కేసు ఛేదించి అరెస్టు చేసిన నవీన్ అనే వెట్టునవీన్, చిరంజీవి, పరశురాం అలియాస్ మధులు కూడా భాను అనుచరులే అని స్పష్టమైంది. టీడీపీలో వారికి ఉన్న పదవులు, భాను ప్రకాష్‌తో వారు తీసుకున్న ఫొటోలతో అసలు నిజం బట్టబయలైంది.





హత్యాయత్నం కేసులో నిందితులతో భానుప్రకాష్ (ఫైల్)

అక్రమ వ్యాపారులదే ప్రధానపాత్ర

టీడీపీ అభ్యర్థి భాను ప్రకాష్‌కు మద్దతుగా ప్రస్తుత ఎన్నికల్లో మద్యం, డబ్బుల పంపిణీలో అక్రమ వ్యాపారులే ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. భాను అధికారంలోకి వస్తే విచ్చల విడిగా తమ వ్యాపారాలను కొనసాగించుకోవచ్చని భావిస్తున్నట్లు తెలిసింది. అందుకే వ్యూహాత్మకంగా ఎవరికీ చిక్కకుండా డబ్బులు. మద్యం పంపిణీ చేస్తూ తమ పూర్తి సహకారం అందిస్తున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో వైస్సార్‌సీపీ రెబల్‌గా పోటీచేసిన అభ్యర్థులు, అలక వహించిన నేతలను కూడా ప్రలోభాలకు గురిచేసి టీడీపీలోకి తీసుకువచ్చేందుకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది.



అక్రమార్కులతో సంబంధాలున్న వ్యక్తి అభ్యర్థిగా వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నేతలు (ఫైల్)

గంజాయి దందా వారిదే..!

పుత్తూరుకు చెందిన టీడీపీ నేత హరికృష్ణ అతడి అనుచరుడు జి.హేమంత్ 2022 జనవరి 10వ తేదీన గంజాయి తరలిస్తూ విశాఖ -అరకు రోడ్డులో విజయనగరం జిల్లా శృంగవరపు కోట వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 14 ప్యాకెట్లలో 28 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరు నగరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భానుప్రకాష్‌కు అత్యంత సన్నిహితులు. ఇదే వ్యక్తి 2023లో పుత్తూరు స్వర్ణా కాలనీలో గంజాయి విక్రయిస్తూ మరోమారు పోలీసులకు పట్టుబడ్డాడు. ఆపై టీడీపీ నిర్వహించిన కార్యక్రమాల్లో భాను ప్రకాష్‌తో కలిసి హరికృష్ణ పాల్గొనడం వారి సాన్నిహిత్యానికి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది. దీంతో భాను అనుచరులైన టీడీపీ నేతలే గంజాయి తరలింపునకు పాల్పడుతున్నట్లు ప్రజలకు స్పష్టమైంది.

సొంత పార్టీ నేతలే తీవ్ర ఆరోపణలు

టీడీపీ అభ్యర్థి భానుప్రకాష్‌కు ఎర్రచందనం, గంజాయి, బియ్యం, అక్రమ మద్యం వ్యాపారులతో సంబంధాలు ఉన్నాయంటూ ఆ పార్టీకి చెందిన నాయకులు చలపతి, లత ఆరోపించడం నియోజకవర్గంలో కలకలం రేపింది. వారు తమ అనుచరులతో కలిసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేయడం స్థానకంగా సంచలనం సృష్టించింది. చీకటి వ్యాపారులతో కుమ్మక్కైన అభ్యర్థి తమకు వద్దు అంటూ బహిరంగంగా నినాదాలు చేయడం ప్రజల మనసుల్లో బలంగా నాటుకుపోయాయి.

19న రాజంపేట ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి నామినేషన్



పుంగనూరు : వైఎస్సార్ సీపీ రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ఈనెల 19వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. సోమవారం ఈ మేరకు రాయలసీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్ మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి తరఫున నామినేషన్ పత్రాలను రాయచోటి రిటర్నింగ్ అధికారికి అందజేయనున్నట్లు వెల్లడించారు. నామినేషన్ దాఖలు చేసే అవకాశాన్ని ముస్లింలకు ఇవ్వడం పెద్దిరెడ్డి కుటుంబం గొప్పతనమని కొనియాడారు. నామినేషన్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ముస్లింలు తరలిరావాలని కోరారు.

జిల్లాకు విద్యుత్ పరికరాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా స్టోర్స్‌కు సోమవారం పలు విద్యుత్ పరికరాలు వచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. సింగిల్ ఫేజ్ విద్యుత్ మీటర్లు 7,500, 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 20 వచ్చాయని వెల్లడించారు. సంబంధిత ఏఈలు వర్క్‌ఆర్డర్లు పెట్టి పరికరాలను తీసుకోవాలని సూచించారు.

సకాలంలో అబ్జర్వర్లకు సమాచారం



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల అబ్జర్వర్‌లకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందజేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల నోడల్ ఆఫీసర్లు, ఎన్నికల అబ్జర్వర్ నోడల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాకు విచ్చేసే అబ్జర్వర్‌లకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందజేసేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అబ్జర్వర్‌లకు కేటాయించిన లైజన్ ఆఫీసర్లు నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. రోజు వారీ అబ్జర్వర్‌ల షెడ్యూల్‌ను సిద్ధం చేసుకుని వారు అడిగే ప్రాంతాలకు తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల అబ్జర్వర్ల పర్యవేక్షణ నోడల్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం



ఇల్లూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని ఎంపీ, చిత్తూరు ఎంపీ అభ్యర్థి ఎన్.రెడ్డెప్ప స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని కమ్మనపల్లె సచివాలయ పరిధిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ కూటమి పార్టీలు ఎన్ని దాడులు చేసినా జగనన్నను ఏమీ చేయలేరన్నారు. దేవుడి దయ, ప్రజల ఆశీర్వాదంతో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వెల్లడించారు. కూటమి నేతలు జగనన్నను రాయితో కొట్టారని, జనం ఓటుతో కొట్టాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశువులు, రాజంపేట ఎన్నికల పరిశీలకుడు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు రూప, నారాయణస్వామి, పార్టీ మండల కన్వీనర్ కార్తిక్, మండల యూత్ ప్రెసిడెంట్ మహేష్, సర్పంచులు రేణుక, వెంకటేష్, రమణారెడ్డి, చంద్రమౌళి, రాజప్ప, బాలకృష్ణగౌడు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన



కుప్పంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, భరత్

కుప్పం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని వైఎస్సార్ సీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ తెలిపారు. సోమవారం పట్టణంలోని 19 వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగనన్న పాలనలో తమ కుటుంబాలకు చేకూరిన మంచిని ప్రతి ఒక్కరూ గుర్తించి ఓటేయాలన్నారు. ఎన్నికల్లో రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుకే వేయాలని పిలుపునిచ్చారు. భరత్ సతీమణి దుర్గ, మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, స్థానిక నేత సునీల్ పాల్గొన్నారు.

నిజాయితీ.. నిబద్ధతతో సుపరిపాలన



బూచివానెత్తంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి రోజా

విజయపురం : ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి నిజాయితీ.. నిబద్ధతతో జగనన్న సుపరిపాలన అందించారని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. సోమవారం మండలంలోని బూచివానెత్తం, సామిరెడ్డి కండ్రిగలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. మంత్రి మాట్లాడుతూ సిఫారసులు లేకుండా, లంచాలు లేకుండా, పార్టీలు చూడకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించినన ఏకైక నేత జగనన్న అని వెల్లడించారు. టీడీపీ ఇప్పటి వరకు మేనిఫెస్టోలో చెప్పిన అంశాలను అమలుచేసిన దాఖలాలే లేవన్నారు. అబద్ధం..మోసం చంద్రబాబుకు తోబుట్టువులని విమర్శించారు. ప్రజలను ఏమారుస్తూనే ఆయన గతంలో గెలిచారని, అలాగే మోసపోయేందుకు ఎవరూ సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రమంతా ఫ్యాను ప్రభంజనం ఖాయమన్నారు. ఇది ప్రతిపక్షాలకు కూడా స్పష్టంగా అర్థమవుతోందని, అందుకే తట్టుకోలేక జగనన్నపై హత్యాయత్నానికి ఒడిగట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, పార్టీ మండల కన్వీనర్ గోపి, ఆనంద్, ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, బూత్ కమిటీ కన్వీనర్ రాజ్‌గోపాల్, సర్పంచ్ కుమార్, కుమార్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ రాజేంద్ర, భాస్కర్‌రెడ్డి, కుప్పయ్య, ప్రసన్న, రాజాదాస్, జీల్‌దాస్, సర్పంచ్ మురళీరెడ్డి, బాబు, ఆముద, వెంకటేశ్, ప్రసాద్, రమేష్, బెన్నీ, అంగముత్తు, నాగరాజు, హరి, శ్రీరాములురెడ్డి, పాండియన్ పాల్గొన్నారు.

ప్రతి సెగ్మెంట్‌కు ప్రత్యేక నంబర్

చిత్తూరు కలెక్టరేట్ : వ్యవహారికంలో మనందరం అసెంబ్లీ నియోజకవర్గాలను పేర్లతో పిలుస్తాం. కానీ సాంకేతికంగా, ఎన్నికల సంఘం విధుల్లో భాగంగా పరిశీలిస్తే జిల్లాలోని ప్రతీ నియోజకవర్గానికి ఓ నెంబర్ ఉంటుంది. దేశ వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలకు ఇలాగే క్రమ సంఖ్య ఉంటుంది. ఎన్నికల సంఘం ఈ నంబర్ ఆధారంగానే రిజర్వేషన్లు, విధుల కేటాయింపు, ఇతరత్రా అన్నీ పరిగణలోకి తీసుకుంటుంది. ఎన్నికల సమయంలో ఆయా నియోజకవర్గాల పేర్లతో పాటు నంబర్లను కూడా తప్పకుండా వినియోగిస్తుంటారు. చిత్తూరు పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నంబర్లు ఇలా ఉంటాయి. చిత్తూరు పార్లమెంట్-25, అసెంబ్లీ - 172, పుంగనూరు-165. నగరి-170, జీడీనెల్లూరు-171, పూతలపట్టు-173, పలమనేరు-174, కుప్పం-175గా ప్రకటించారు.

క్లుప్తంగా

బైకుల చోరీ కేసులో ఇద్దరికి జైలు

శాంతిపురం : బైకుల చోరీకి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులపై నేరం రుజువు కావటంతో వారికి రూ.10 వేల జరిమానా లేక రెండు నెలల జైలు శిక్షను సోమవారం కోర్టు విధించినట్టు రాళ్లబూదుగూరు ఎస్‌ఐ వి.సుమన్ తెలిపారు. 2023 జూలైలో శాంతిపురం టీటీడీ కల్యాణమండపం వద్ద పార్కు చేసిన బుల్లెట్ చోరీకి గురైంది. వాహన యజమాని కర్ణాటకలోని కూతండహళ్లికి చెందిన చౌడప్ప వెంటనే రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు అదే ఏడాది ఆగస్టు 17వ తేదీన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చి రాళ్లబూదుగూరులో ఉంటున్న ఉమ్మర్ ఫారుక్ ఖాన్, స్థానికుడైన ప్రకాష్ ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. వారి నుంచి బుల్లెట్‌తో పాటు మరో 24 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుపై కుప్పం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో సాగిన విచారణలో నిందితుల నేరం నిర్ధారణ కావడంతో వారికి శిక్ష పడినట్లు ఎస్‌ఐ వివరించారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం


మునెప్ప (ఫైల్)

గుడుపల్లె : కర్ణాటకలోని మైసూర్ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై అంగడి మునెప్ప(47) అనే వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. వివరాలు.. గుడుపల్లె మండలంలోని కనమనపల్లె గ్రామానికి చెందిన అంగడి మునెప్ప శనివారం వేకువ జామున బైక్‌పై ఇంటి నుంచి బయలు దేరాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు, బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం సాయంత్రం గుడుపల్లె పోలీసులు మైసూర్ వద్ద రైలు కింద పడి మునెప్ప మృతి చెందినట్లు కుటుంబీకులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

కూలి పనికి తీసుకెళ్లి కండువా కప్పేశారు!

- టీడీపీ నేతల తీరుపై
- టీఆర్ కండ్రిగ వాసుల ఆగ్రహం


సోమవారం రాత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువాలతో టీఆర్ కండ్రిగ వాసులు


టీడీపీ అభ్యర్థి నివాసం వద్ద సోమవారం ఉదయం పచ్చకండువాలతో టీఆర్ కండ్రిగవాసులు

నగరి : ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నేతలు వివిధ రకాల జిత్తులు ప్రదర్శిస్తున్నారు. ప్రతిరోజు ఏదో ఒక నెపంతో జనాలను తీసుకురావడం.. వారికి పచ్చ కండువాలు కప్పేయడం.. వైఎస్సార్‌సీపీ నుంచి వారందరూ టీడీపీలోకి చేరిపోయారంటూ ఎల్లో మీడియాలో ఊదరగొట్టేయడం.. చివరకు ఎంతో కొంత డబ్బులు ముట్టజెప్పి పంపేయడం.. ఇదే తంతును కొనసాగిస్తున్నారు. ఊళ్లకు ఊళ్లు టీడీపీలో చేరిపోతున్నాయంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు విశ్వయత్నం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో వైసీపీకి షాక్.. టీడీపీలో చేరిన వైఎస్సార్‌సీపీ నేతలు అంటూ వచ్చే వార్తలు, ఫొటోలను చూసినవారు ముక్కున వేలేసుకుంటున్నారు. వీరు ఎప్పుడూ వైఎస్సార్‌సీపీలో లేరే.. ఎప్పుడూ కార్యక్రమాల్లో చూడలేదే అంటూ ఆరా తీసి వాస్తవాలు తెలుసుకుని ఆశ్చర్యపోతున్నారు. ఈ పరిస్థితి సోమవారం ఉదయం పుత్తూరు మండలం టీఆర్ కండ్రిగకు చెందిన వారికి ఎదురైంది. స్థానిక టీడీపీ నేతలు కూలి పని ఉంది వస్తారా రూ.500 ఇస్తాం, బిర్యానీ పొట్లాం అందిస్తాం అని పాపం చెబితే ఆ అమాయక గ్రామస్తులు గుంపులుగా వెళ్లారు. తీరా అక్కడకు వెళ్లాక పనేమి లేదు పచ్చ కండువాలు కప్పుకుంటే చాలు డబ్బులిచ్చి, బిర్యానీ ఇచ్చి పంపేస్తాం అంటూ కండువాలు కప్పేశారు. అక్కడి నుంచి తిరిగి ఇంటికి చేరుకునేలోపు సామాజిక మాధ్యమాల్లో వైఎస్సార్‌సీపీకి షాక్.. టీఆర్ కండ్రిగ నుంచి 100 మంది టీడీపీలో చేరిక అంటూ వార్త చక్కర్లు కొడుతోంది. అప్పటికిగానీ వెళ్లినవారికి టీడీపీ నేతల జిమ్మిక్కులు బోధపడలేదు. కూలి డబ్బులకు ఆశపడి తప్పుచేశామంటూ బాధపడ్డారు. అదే సమయంలో గ్రామానికి ప్రచారం నిమిత్తం వచ్చిన మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి వద్దకు వెళ్లి విషయం వివరించారు. కండువాలు కప్పేస్తే ఓట్లేసేస్తామా.. మేమంతా జగనన్న సంక్షేమంతో బతికేటోళ్లం.. వైఎస్సార్‌సీపీనే మాకు అండ అంటూ పార్టీ కండువాలను స్వచ్ఛందంగా వేసేసుకున్నారు. దీంతో షాక్...షాక్ అన్న టీడీపీ నేతలే షాక్‌కు గురయ్యారు.

టీడీపీ తరఫున ప్రచారంలో ఉద్యోగి


టీడీపీ అభ్యర్థి గురజాలతో ప్రభుత్వోద్యోగి దేవరాజులు (బొట్టు పెట్టుకొని మహిళ వెనుక ఉన్న వ్యక్తి)

చిత్తూరు కార్పొరేషన్: తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దేవానందం టీడీపీ సేవలో తరిస్తున్నారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా టీడీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని వెల్లడిస్తున్నారు. దీంతో ఆయనపై జిల్లా ఎన్నికల అధికారికి స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇటీవల దొడ్డిపల్లెలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే సీకేబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సైతం దేవానందం పాల్గొన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఏ–ఫారమ్ అంటే తెలుసా..?

మీకు తెలుసా!



చిత్తూరు కలెక్టరేట్ : రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో బి–ఫారమ్ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. పోటీలో ఉండే అభ్యర్థులకు ఆయా పార్టీలు బి–ఫారమ్ అందిస్తాయి. ఇందులో అభ్యర్థి, పార్టీ పేరు, గుర్తు, అసెంబ్లీ నియోజకవర్గం వివరాలతో పాటు ఆయా పార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. నామినేషన్ పత్రాలతో పాటు బీ ఫారమ్‌ను జత చేస్తేనే ఎన్నికల రిటర్నింగ్ అధికారి పార్టీ గుర్తును కేటాయిస్తారు. అలాగే ఏ–ఫారమ్ కూడా ప్రాముఖ్యతను కలిగి ఉంటుంది. ఏ–ఫారమ్‌ను సంబంధిత పార్టీ ఎన్నికల సంఘానికి అందజేయాల్సి ఉంటుంది. ఇందులో పార్టీ పేరు, పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థుల పేర్లు, ఎక్కడెక్కడి నుంచి ఎవరు పోటీ చేస్తున్నారనే వివరాలు ఉంటాయి. ఏ–ఫారమ్ కింద మూడు చోట్ల పార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. ఈ సంతకాలను ఫోర్జరీ చేయకుండా జాగ్రత్త వహిస్తారు. అభ్యర్థులందరూ బి–ఫారమ్‌ను నియోజకవర్గ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారులకు సమర్పించాక, ఏ–ఫారమ్‌ను ఎన్నికల సంఘానికి అందజేస్తారు. ఈ రెండింటిని పోల్చి చూసుకున్నాకే అభ్యర్థి సదరు పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లుగా ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది.

పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా వసతులు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్


హాజరైన ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు.

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా వసతులు కల్పించాలని, దీనిపై ఈ నెల 25వ తేదీలోపు నివేదిక సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్‌ఓ, ఏఆర్‌ఓలతో ఎన్నికల కసరత్తుపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో, నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియకు ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రచార వాహనాల్లో అధికంగా సౌండ్ పెడితే వెంటనే సీజ్ చేయాలని స్పష్టం చేశారు. ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్‌ల పరిశీలన, 29 వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుందని వివరించారు. నామినేషన్ల ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఆర్‌ఓలు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్‌లలో వీడియోగ్రఫీ ఉంటుందన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక, సరిహద్దు ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ జరుగుతుందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీల్‌చైర్ ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు మరుగుదొడ్లు, ఫర్నీచర్, విద్యుత్, ర్యాంప్ సౌకర్యాలు పక్కాగా ఉండాలని సూచించారు. పోలింగ్ స్టేషన్‌లకు బస్సు సౌకర్యాలను పరిశీలించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక సేఫ్ హౌస్‌ను గుర్తించాలని కోరారు. పోలింగ్ మెటీరియల్ సంబంధిత ఆర్‌ఓ లకు అందజేయడం జరిగిందని, రాజకీయ పార్టీలకు అందజేయవలసిన మెటీరియల్ పంపిణీ చేయాలని ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియలో ప్రతి ఆర్‌ఓ నూతన ఎలక్ట్రోరల్ జాబితాను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే ఉంటుందని తెలిపారు. అభ్యర్థి సహా ఐదుగురిని మాత్రమే లోపలికి అనుమతించాలని స్పష్టం చేశారు. అనంతరం నామినేషన్‌ల పరిశీలన, తదితర అంశాలను విశ్రాంత ఏజేసీ చంద్రమౌళి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణం చర్చి వీధిలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందడం స్థానికంగా చర్చనీయాంశమైంది. పోలీసుల కథనం.. పట్టణంలోని చర్చి వీధిలో నూతనంగా నిర్మిస్తున్న ఓ భవంతి వద్ద మనుబోలు మండలం, కొండూరు సత్రంకు చెందిన మస్తానయ్య(65) నెల రోజులుగా వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి విధి నిర్వహణ నిమిత్తం వచ్చిన వ్యక్తి ఉదయం నిద్ర లేచి చూసే సరికే రక్తపు మడుగులో మృతి చెంది ఉన్నాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఒకటవ పట్టణ సీఐ పాపారావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనుమానాస్పదంగా మృతిచెందినట్టు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కాణిపాకం (చిత్తూరు రూరల్): కాణిపాకంలోని ప్రభుత్వాస్పత్రి వెనుకభాగంలో సోమవారం నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. మరో ఇద్దరు పారిపోయినట్లు వెల్లడించారు. నిందితుల నుంచి రూ.10,150ల నగదు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వివరించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పాదరక్షలు ధరించనంటూ ‘దీక్ష’

జగనన్న అంటే అభిమానం.. వైఎస్సార్‌సీపీ నాయకులు ఏ పని చెప్పినా వెంటనే చేస్తుంటాడు.. ఎన్నికల వేళ పార్టీ సేవకు అడ్డుగా మారిందని కుటుంబ పోషణకు ఆధారమైన వలంటీర్ ఉద్యోగానికి సైతం రాజీనామా చేసేశాడు.. అంతే కాకుండా జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసే వరకు పాదరక్షలు ధరించనంటూ దీక్ష చేపట్టాడు. చెప్పులు లేకుండా మూడు నెలలుగా మండుటెండల్లో సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడు.


పాదరక్షలు లేకుండా ఎన్నికల ప్రచారంలో గణపతి

కుప్పంరూరల్ :కుప్పం మండలం గుడ్లనాయనపల్లెకు చెందిన గణపతి. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేస్తున్నాడు. గుడ్లనాయనపల్లె పంచాయతీలో తొలుత వైఎస్సార్‌సీపీ జెండా పట్టిన అతికొద్ది మందిలో గణపతి ఒక్కడు. పేదవాడైన ఏమాత్రం వ్యయ ప్రయాసలకు వెనుకాడకుండా జిల్లాకు ఎప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చినా వెంటనే అక్కడ వాలిపోతాడు. 2019 ఎన్నికలప్పుడు పంచాయతీలో పార్టీ ఆధిపత్యానికి, సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో విజయానికి అవిశ్రాంతంగా కృషి చేశాడు. గణపతి నిబద్ధతకు వలంటీర్ ఉద్యోగం వచ్చింది. అప్పటి నుంచి 1వ తేదీ వేకువనే జిల్లాలో మొదటి పింఛన్ పంపిణీ చేసేది గణపతే అంటే అతిశయోక్తి కాదు. ఎన్నికల వేళ తన అభిమాన నాయకుడిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు తన వలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పార్టీకి అంకితమయ్యాడు. అక్కడితో ఆగకుండా జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయ్యేవరకు చెప్పులు వేసుకోనంటూ దీక్ష పూనాడు. ఎంతమంది ఎన్నివిధాలుగా చెప్పినా వినకుండా దీక్ష కొనసాగిస్తున్నాడు.

బంగారు తిరుచ్చిపై విహారం



చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారికి అనుబంధంగా వెలసిన శ్రీరామచంద్ర, అమ్మవారితో కలసి సోమవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం పునర్వసు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారు అయన బంటు హనుమంతులవారితో కలసి బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ ఏఈఓ గోపీనాథ్, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి కోదండరాముడి వార్షిక బ్రహ్మోత్సవాలు


కోదండరామ స్వామి వారు (ఫైల్)

చంద్రగిరి: స్థానిక చంద్రగిరి శ్రీకోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 16వ తేదీ సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 17న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం హనుమంత వాహన సేవ ఉంటుందని తెలిపారు. అలాగే ఏప్రిల్ 23న శ్రీసీతారాముల కల్యాణోత్సవం, సాయంత్రం గరుడ వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నట్టు వెల్లడించారు. రూ.750 చెల్లించి గృహస్తులు(ఇద్దరు) కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చని తెలిపారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే దాడి


నిరసన తెలుపుతున్న సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్, నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: సిద్ధం సభలు, బస్సు యాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే చంద్రబాబునాయుడు ఉసిగొల్పి అల్లరిమూకల చేత సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిపై రాళ్లదాడి చేయించారని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ తెలిపారు. ఆయన బుధవారం తలారివెట్టు గ్రామంలో సీఎంపై రాళ్లదాడికి నిరసనగా నల్లబ్యాడ్జీలు ధరించి, కరపత్రాలను ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేకనే చంద్రబాబు ఇటువంటి నీచమైన ఘటనలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనరు అరణి విద్యానాథరెడ్డి, నాయకులు అరణిసుధాకర్‌రెడ్డి, మునిరెడ్డి, వేలూరురాకేష్, హరనాథరెడ్డి, గోపాల్‌రెడ్డి, మణినాయుడు, గురునాథం, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌పాల్, సర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

‘కూటమి’ కుట్రలకే వలంటీర్ల రాజీనామా


పెద్దపంజాణి : రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్లు


గంగవరం : ఎంపీడీఓకు రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

పెద్దపంజాణి: జిల్లావ్యాప్తంగా వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. సోమవారం పెద్దపంజాణి మండలంలోని శంకర్రాయలపేట సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న 18 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా కుల, మతాలు, పార్టీలు, వర్గాలు చూడకుండా నిష్పక్షపాతంగా ప్రజలకు సేవ చేశామన్నారు. సేవా భావంతో, నిస్వార్థంగా విధులు నిర్వహిస్తున్న తమను కించపరుస్తూ, నిందలు వేసిన కూటమి నేతల వైఖరికి నిరసనగా రాజీనామాలు చేసినట్లు తెలిపారు. ఇప్పుడు జగనన్న రుణం తీర్చుకునే అవకాశం వచ్చింది, తప్పకుండా మరోసారి ఆయనను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు తమ వంతు పాత్ర పోషిస్తామని స్పష్టం చేశారు.

గంగవరంలో..

గంగవరం : గంగవరం 1, 2, 3 మూడు సచివాలయాల పరిధిలోని గ్రామ వలంటీర్లు సోమవారం రాజీనామాలు చేశారు. ఈ సచివాలయాల పరిధిలో మొత్తం 54మంది వలంటీర్లు ఉండగా అందులో 26 మంది ఇప్పటికే రాజీనామా చేశారు. మిగిలిన వారిలో 14 మంది తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. పేదలకు పింఛన్లు పంపిణీ చేయనీయకుండా చంద్రబాబు అడ్డుకుని ప్రజలను ఇబ్బందులకు గురిచేసినట్టు మండిపడ్డారు. జగనన్నను ఎన్నికల్లో నేరుగా ఎదుర్కొనే సత్తా లేకే కూటమికి చెందిన సైకో నాయకులు దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఐదేళ్లపాటు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటామని తెలిపారు.